ప్రజాశక్తి
గురువారం 10 నవంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు

డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ స్థాయి పోటీలకు కిల్లోగూడ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినిలు 18 మంది ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 11న పాడేరులో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారరన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

▶▶ 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ▶▶ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఈ ఏడాది 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా 56 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఛాంబర్ నుండి సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, తహసిల్దార్లు, అన్ని మండలాల వ్యవసాయ అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, రైతు ఎట్టి పరిస్థితిలో ఒక్క ధాన్యం గింజ కూడా నష్టపోకుండా చూడాల్సిన భాద్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి రైతు మద్దతు ధర పొందాలన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2040లు, ఎ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2060లు మద్దతు ధర నిర్ణయిం చడం జరిగిందని తెలిపారు.
కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల మిలర్లతో రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేసి టాగింగ్ చేయాలని సూచించారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారులకు యూజర్ ఐడి, పాస్ వర్డ్ క్రియేట్ చేసి అందించాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్‌ను ఆదేశించారు. ఎంఎఓలు వాటిని దుర్వినియోగ పరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి, వ్యవసాయాధికారులకు తేమ శాతం నిర్ణయించడం, బరువు కొలవడం, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. రైతులతో సమావేశమై వారికి అవాగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మంచి నాణ్యమైన ధాన్యం లభిస్తున్నందున, మిల్లర్లకు ఒక బస్తాకు 600 గ్రాములు మించి సడలింపు ఇవ్వరాదని, తద్వారా రైతు ఒక్క ధాన్యం గింజ కూడా నష్ట పోకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైన గొనె సంచులు సేకరించుకోవాలని, ధాన్యం రవాణాకు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని రైతు భరోసా కేంద్రాలకు అవసరమైన ప్రచార సామగ్రి, ఫ్లెక్సీలు సరఫరా చేయాలన్నారు. ఈనెల 15 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ప్రారంభించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ జే. శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్లు శుభం బన్సాల్, ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా పౌర సరఫరాల అధికారి శివ ప్రసాద్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, తహసిల్దార్లు పాల్గొన్నారు.

పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు కీలకం

ప్రజాశక్తి-అనంతగిరి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమని పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ఎస్.సైమన్ తెలిపారు. చిలకలగెడ్డ బాలుర పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు ప్రభుత్వం కల్పిస్తున్న అమ్మఒడి, భోజన వసతి సౌకర్యాలు సక్రమంగా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఏ లోటు వచ్చినా పాఠశాల సిబ్బంది ఎల్లవేళలా అందు బాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారన్నారు. మండల స్థాయిలో జరిగిన క్రిడా పోటీల్లో తమ పాఠశాలకు మంచి పేరు వచ్చిందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి స్థానం దక్కించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిహెచ్ గురుమూర్తి, డిప్యూటీ వార్డెన్ గాసి, ఉపాధ్యాయులు భాస్కరరావు, రమణ పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

మాట్లాడుతున్న సురేంద్ర

గిరిజన సమస్యలపై ప్రధాని మోడీ స్పష్టమైన హామీ ఇవ్వాలి

అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లు ఆపాలి
గిరిజన వర్సిటీకి పూర్తిస్థాయి నిధులు ఇవ్వాలి
గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి -పాడేరు: విశాఖ సభలో గిరిజన సమస్యల పరిష్కారంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి, వీటి పట్ల స్పష్టమైన హామీలు ఇవ్వాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈనెల 11న మోడీ విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా పలు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ఏపీజీఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు తక్షణమే కేంద్రం నిధులు విడుదల చేసి పునరావాసం కల్పించాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలన్నారు. గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి నిధులు పూర్తిగా కేటాయించాలన్నారు.
విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ఆందోళనలు చేస్తున్న ప్రధాని స్పందించలేదని తెలిపారు.తక్షణమే కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లు తెచ్చి ఏజేన్సీ ప్రాంత సహజ వనరులను బడా కంపెనీ లకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందన్నారు. జీఓ 3ను పునరుద్ధరణ చేసి గిరిజన ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రాష్ట్రంలో ప్రత్యేక హెూదా కల్పించి, గిరిజన యూనవర్సిటీ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి గిరిజన నిర్వాసితులకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు నర్సయ్య, ఎం.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న రమాప్రభ, చిత్రంలో త్రిమూర్తులురెడ్డి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి- సీలేరు
రానున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. బుధవారం సీలేరు వచ్చిన ఆమె పట్టభద్రులను కలిసి తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో ఉన్న జీవ నదులపై ప్రాజెక్టులు నిర్మించకపోవడం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారణమని చెప్పారు. దీంతో ఇక్కడ పనుల్లేక రైతులు కూలీలు వలసబాట పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దశాబ్దాలు గడిచినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇక్కడున్న పట్టభద్రులు వేరే పట్టణాలకు వలస పోతున్నారన్నారు. వలసలను అరికట్టడానికి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో పాటు ఉపాధి ఇస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని, ఈ ప్రాంతంలో పోరాడే వారి తరుపున నిలబడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, గాలకొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఓ మేరీరోజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యువజనోత్సవాల్లో 15 నుంచి 29 ఏళ్ల వయసు కలిగిన యువతీ యువకులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. జానపద నృత్యం, జానపద గీతం, వన్యాక్షే, వక్తృత్వ, సాంప్రదాయగాత్రం, సాంప్రదాయ నృత్యం, సాంప్రదాయ వాయిద్యాలు, మృదంగం, తబలా, హర్మోనియం, గిటార్ అంశాల్లో జాతీయ స్థాయి వరకు, ఆధునికగీతం, ఆధునిక నృత్యం, మానోయాక్షన్, మిమిక్రీ, వెంట్రిలోక్విజమ్, మేజిక్, పెయింటింగ్, వయోలిన్, ఫ్యాన్సీడ్రస్, క్విజ్, గ్రూప్ డిష్కషన్ అంశాలలో రాష్ట్రస్థాయి వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 25న పాడేరు డిగ్రీకళాశాల వేదికగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించబడతాయని, ఈనెల 23లోపు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తులు ఎంపిడిఓ కార్యాలయాల నుండి పొందాలని, మరిన్ని వివరాలకు 0891-2558291 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతగిరి:
జలపాతాలకు వచ్చే పర్యటకులు అప్రమత్తంగా ఉండాలని అనంతగిరి ఎస్సై కరక రాము సూచించారు. మండలంలో కాశీపట్నం, గోస్తిని నదీ పరివాహక ప్రాంతంలో పర్యటకులు స్నానాలు చేస్తున్న ప్రదేశాలలో బుధవారం హెచ్చరిక బోర్డులను కో ఆప్షన్ సభ్యుడు మదీనాతో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విహారం కోసం వచ్చే పర్యాటకులు విషాదంతో తిరిగి ఇళ్లకు వెళ్లకుండా ఉండాలంటే జలపాతాల వద్ద అప్రమత్తంగా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతగిరి పంచాయతీలో తాడిగుడ, ఎగువశోభ, మర్ధగుడ, కటికి, పెదబయలు, చిటంపాడు జలపాతాలకు వచ్చే పర్యాటకులు స్థానికుల హెచ్చరికలు పాటించాలని సూచించారు. అతిగా ప్రవర్తించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.గోస్తని వద్ద రోజుకు ఒక వాలంటీర్‌ను, వారాంతపు రోజుల్లో ఒక హెూంగార్డును సైతం ప్రమాదాలు జరగకుండా అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన చెప్పారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ

నినాదాలు చేస్తున్న నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణపై నిరసన

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరించుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని బుధవారం ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం, ఆధ్వర్యంలో అరకువేలి డిగ్రీ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. మోడీ గో బ్యాక్ అని పెద్ద ఎత్తున నినదాలు చేశారు. అనంతరం గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న మాట్లాడుతూ,ప్రత్యేక హెూదా, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి ప్రధాని తీవ్రంగా ద్రోహం చేశారన్నారు. విభజన హామీలు అమలు చేస్తామని స్పష్టమైన ప్రకటన చేసి విశాఖపట్నం పర్యటించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి గుండెకాయ వంటి స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఉప సంహరించుకోవాలని తెలిపారు. వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను కారు చౌకగా అమ్మడం ఎంతవరకు సమంజసమన్నారు. జీవో 3ను పునరుద్ధరణ చేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కె.సిమోన్, పి.కృష్ణ, జి.కార్తీక్, జి.హరి, ఎస్.సింగ్, రవి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న టిడిపి నేతలు

ములియాపుట్టులో 'బాదుడే బాదుడు'

ప్రజాశక్తి -హుకుంపేట: పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర డిమాండ్ చేశారు. మండలంలోని ములియాపుట్టు గ్రామ పంచాయతీ లో పర్యటించి బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన ధరలతో ప్రజలపై అధిక భారం పడుతుందని ఆయన అన్నారు. కరోనా కష్టకాలం తర్వాత సామాన్య ప్రజలు కోలుకోలేని పరిస్థితులు ఉండగా నిత్యావసర సరుకులు, బస్ చార్జీలు, పెట్రోల్‌చ డీజిల్, ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను బాధించడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడుగుపల్లి సర్పంచ్ సోమెలి లక్ష్మయ్య, ములియపుట్టు ఉప సర్పంచ్ కిరసాని చిన్నతల్లి, అరకు అసెంబ్లీ ఎస్టి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి బోయిన శంకర్ నాయుడు, నాయకులు భీమన్న దొర, కోటి వెంకట్, మధు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం

- ఏమి అభివృద్ధి చేశారని మోడీ వస్తున్నారు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
ఆంధ్ర రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతిన సీతారాం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడని ప్రధాని మోడీ ఏం మొహం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారని ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు అధ్యక్షతన జరిగింది. ఇందులో పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ ఈ నెల 11,12 తేదీల్లో ప్రధాని మోడీ విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో కార్మికులు, రైతులు, పేద, మధ్యతరగతి ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వానికి అధికార వైసీపీ ప్రభుత్వం మోకరిల్లడం సరికాదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించే, ప్రభుత్వానికి ఏటా లక్షలాది కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చే విశాఖ స్టీల్ ప్లాంటును అమ్మకానికి పెట్టిన బిజెపిని ప్రశ్నించాల్సిన వైసిపి ప్రభుత్వం దానికి వత్తాసు పలకడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించకపోగా, మోడీ జపం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ఈ సమస్యలపై సిపిఎం మాత్రమే నికరంగా నిరంతరం పోరాడుతుందని చెప్పారు.
రంపచోడవరం నియోజకవర్గంలో అభివద్ధి శూన్యమని, సరైన రహదారులు లేవని విద్య, వైద్యం, విద్యుత్, సాగునీరు, తాగునీరు వంటి సమస్యలు వెంటాడుతున్నాయని, అయినా వాటిని పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒపికి తగినన్ని మందులు లేవని, అంబులెన్సులు, వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం భవనాలు నిర్మాణాల పేరిట కోట్లాది రూపాయలు వృథా చేస్తుందని, ఆ డబ్బులు ఏజెన్సీలో మౌలిక వసతులకు ఖర్చు చేస్తే ఉపయోగకారంగా ఉంటాయని హితవుపలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశాయని, వారిని నమ్మించి నట్టేట ముంచేశాయని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా నాయకులు ఎం.వాణిశ్రీ, మండల నాయకులు కొండ్ల సూరిబాబు, కె జగన్నాథం, టి శ్రీను, దొరబాబు, పి సత్యనారాయణ, రమేష్, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

చదువుతో పాటు ఆటలు నేర్పించాలి

నియోజకవర్గ స్థాయి క్రీడల ప్రారంభంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం
ఏజెన్సీలోని విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా నేర్పించే బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. బుధవారం మండలంలోని ముసురుమిల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో రంపచోడవరం నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల్లోని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. 9, 10 తేదీల్లో వాలీబాల్, కబాడీ, ఖోఖో, విలువిద్య, హ్యాండ్ బాల్, సెటిల్ బ్యాడింటెన్ తదితర ఆటల్లో నెగ్గిన క్రీడాకారులతో డివిజన్ స్థాయిలో ఆడతారని చెప్పారు. అక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆటల పోటీలకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. 11 మండలాలలోని 56 స్కూళ్లకు చెందిన 800 మంది బాలబాలికలను ఈ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు హాజరైనట్లు తెలిపారు. వీరికి భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, ఏటిడబ్ల్యూఓ రామ తులసి, మండల విద్యాశాఖ అధికారి కెవివి.సత్యనారాయణ దొర, ప్రధానోపాధ్యాయులు కెఆర్‌పి కుమార్, స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి, ఎం.సృజన దొర, ఫిజికల్ డైరెక్టర్లు కె. తిరుపతిరావు, కె. పోతురాజు, మంగయమ్మ, నాగిరెడ్డి, మురళి, రామయ్యమ్మ, వార్డెన్లు వెంకన్న దొర, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం
జిల్లాలో ఈ సంవత్సరం 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గణేష్ కుమార్‌తో కలిసి స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాలకు సంబంధించిన జిసిసి మేనేజర్లు, డిఎంలు, గొడౌన్ ఇన్‌ఛార్జులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని జీకే వీధి మండలం మండలంలో 4 కొనుగోలు కేంద్రాలు, కొయ్యూరులో 3, చింతపల్లిలో 3, పాడేరులో 3, కూనవరంలో 4, దేవీపట్నంలో 4, గంగవరంలో 3, ఎటపాకలో 5, విఆర్.పురంలో 3, అడ్డతీగలలో 3, చింతూరులో 4, వై.రామవరంలో 4, రాజవొమ్మంగిలో 6, మారేడుమిల్లిలో ఒకటి, రంపచోడవరంలో 6, మొత్తం 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో పదివేల గోనెసంచులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్నింటికీ జిసిసి ద్వారా గోనె సంచులు సరఫరా చేయాలన్నారు. ఈ ధాన్యాన్ని సంబంధించిన రైతులకు డబ్బులు సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లతోనూ, ధాన్యం తరలించే లారీ ఓనర్లతోనూ ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలని సూచించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఏడు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి కేంద్రానికి రూట్ అధికారులుగా వాలంటరీలను ఉపయోగిస్తామని, ధాన్యానికి సంబంధించిన రైతు, వాలంటరీ ఇరువురు కలిసి ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలని సూచించారు. టెస్టులు చేసి క్వాలిటీ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై మేనేజర్ గణేష్ కుమార్, జిసిసి డివిజనల్ మేనేజర్ పార్వతీశం, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, జిసిసి సీనియర్ మేనేజర్లు ఎంఎన్.రాజారెడ్డి, జి.చంద్రశేఖర్, విజయలక్ష్మి, భాస్కరరావు పాల్గొన్నారు.

పశువులు మృత్యువాత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతలపూడి పంచాయతీలో వ్యాధులు సోకి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో ఈ మధ్య కాలంలోనే సుమారు 45 మేకలు, 8 ఆవులు మృత్యువాత పడినట్లు రైతులు చెప్పారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు వ్యవసాయం, పశువుల మీద ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అలాంటిది పశువులు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి రాజేష్‌ను వివరణ కోరగా పశువుల విషయంలో మండలంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నామని చెప్పారు. అందులో భాగంగా ఈనెల 10న చింతలపూడిలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పశువులకు ఎటువంటి వ్యాధులు వచ్చిన తమ దృష్టికి తీసుకొస్తే తగిన చికిత్స చేస్తామని తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో పెద లువ్వాసింగి పంచాయతీ చుట్టుగుమ్మి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు స్థానిక సర్పంచ్ కొండపల్లి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ, పెదలువ్వాసింగి పంచాయతీలో అన్ని గ్రామాలకు రహదారుల పనులు త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కొండపల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గబ్బాడి పండు దొర, వార్డు మెంబర్ కొండపల్లి చిన్నకొండబాబు, వైసీపీ యువజన నాయకులు వండ్లబు సూర్యప్రకాష్, వైసీపీ పంచాయతీ ప్రధాన కార్యదర్శి సుకూరు నీలకంఠం, మాజీ సర్పంచ్ తల్లే చిట్టిబాబు పాల్గున్నారు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సచివాలయంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెదబయలురూరల్: ఫ్యామిలీ ఫీజీషియన్ లో భాగంగా బుధవారం కుంతుర్ల సచివాలయం లో స్థానిక వైద్య బృందం పర్యటించింది. గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ మాట్లాడుతూ, ప్యామిలీ పిజిషియన్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని కోరారు. మంచం పట్టిన రోగుల గృహాలను సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గుండె జబ్బుతో బాధ పడుతున్న కొండబాబును మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. ప్రతీ నెల నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సింహాచలం, సచివాలయం ఎఎన్ఎం, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

13న వైజాగ్ నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వైజాగ్ నేవీ మారథాన్‌ను ఈ నెల 13న ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రేస్ డైరెక్టర్ డాక్టర్ మురళి నన్నపనేని తెలిపారు. బుధవారం ఉదయం వెల్ కం హోటెల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వైజాగ్ నేవీ మారథాన్ ఏడవ ఎడిషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇండియన్ నేవీ స్పోర్ట్స్ ఏరినాతో కలిసి నేవీ మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మారథాన్‌ను క్లీన్ అండ్ గ్రీన్ వేడుకగా నిర్వహించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు. మారథాన్‌లో పాల్గొనదలచిన వారు ఈ నెల 11, 12 తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యన వెల్ కం హోటల్ నందు పేరు నమోదు చేసుకుని రేస్ కిట్ పొందాలని సూచించారు. vizagnavymarathon.com ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల అరెస్టు అప్రజాస్వామికం

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటుకు అప్పగించకూడదని ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన బైక్ ర్యాలీని అడ్డుకొని 200 మందిని అరెస్టు చేయడాన్ని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. విశాఖ స్టీలు ప్రైవేటీకరణను బిజెపి మినహా అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని, అసెంబ్లీలో తీర్మానం చేసిన వైసిపి ప్రభుత్వం రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు తలమానికమైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకూడదని 635 రోజుల నుండి కార్మికులు ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని, అందులో భాగంగానే విశాఖలోని కూర్మన్నపాలెం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రశాంతంగా బైక్ ర్యాలీ చేస్తుండగా పోలీసులు అడ్డుకుని 200 మందిని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ర్యాలీకి అనుమతినిచ్చి క్యాన్సిల్ చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రధాని విశాఖ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడి విశాఖ ఉక్కుపై ప్రకటన చేయించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావల్సింది పోయి వత్తాసు పలకడం గర్హనీయ మన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి నిర్బంధానికి పూనుకోవడం సరి కాదని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగి విశాఖ స్టీల్‌ప్లాంటును రక్షించేందుకు కార్మికులకు అండగా నిలవాలని, ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కు తీసుకునేలా ఈ పర్యటన సందర్భంగా ప్రధానిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

దుకాణం నిర్మాణ పనులు అడ్డగింత

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో గిరిజనుడు దుకాణం నిర్మించుకోవడానికి ప్రయత్నించగా అధికారులు అడ్డగించారు. గిరిజనేతరులు అక్రమ కట్టడాలు కట్టుకుంటున్నా స్పందించని అధికారులు నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజనుడు గొళ్ళోరు వెంకటరమణ దుకాణ నిర్మాణ పనులు అడ్డుకోవడంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గిరిజనుడు వెంకటరమణ కుటుంబాన్ని పోషించేందుకు బతుకుతెరువుకై రోడ్డు పక్కన చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుంటున్న సమయంలో హుటాహుటిన పంచాయితీ సెక్రటరీ వచ్చారు. ఈ స్థలం మసీదుకు చెందినదని చెప్పి పనులు ఆపివేశారు.

ఇదిలా ఉండగా గిరిజనేతరులు హుకుంపేట మండల ప్రధాన కూడలిలో భవనాల నిర్మాణాలు చేపడుతున్నా వాటిని నిలుపుదల చేయక పోవడంపై పలువురు గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఒక గిరిజనేతరుడు భవన నిర్మాణం చేపడుతుంటే సంబంధిత అధికారులు అక్రమ కట్టడాలు వెంటనే నిలిపివేయాలని నేరుగా వెళ్ళి హెచ్చరించి ఆదేశాలు కూడా జారీ చేశారు. కానీ వారి ఆదేశాలు గాలికి వదిలేసి భవన నిర్మాణం మొదటిలోనే నిలిపివేసి రెండు రోజుల వ్యవధిలో శ్లాబ్ నిర్మించారు.మండలంలోని గిరిజనేతరులు అక్రమ కట్టడాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని తెలిసినప్పటికీ నిర్మాణాలు చేపడుతున్నారు. గిరిజనులు చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుంటేనే జులం చూపించే అధికారులు గిరిజనేతరులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ, రెవిన్యూ అధికారులు గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు పై దృష్టి సారించి నిలుపుదల చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు కోరారు.మండలంలోని అక్రమ కట్టడాలు కడుతున్నా పట్టనట్టుగా వ్యవహరించడం సరికాదని ఆయన అన్నారు.

పోలీసుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో వారపు సంతలో సీఐ జీడి బాబు ఆధ్వర్యంలో బుధవారం ఆన్లైన్ రుణాలు, గంజాయి సాగు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ముందుగా పంచాయతీలోని యువత, మహిళలతో మాట్లాడుతూ, ఆన్లైన్ రుణాలు చేసి ప్రాణాలపై తెచ్చుకోవద్దని తెలిపారు.నాటుసారా తయారీ, గంజాయి సాగు వంటివి చేయరాదని, ఈ విధంగా చేసినట్లయితే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం సంతలో ర్యాలీ నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి ఏఎస్ఐ రాజాం నాయుడు, ఏపీఎస్పీ సిబ్బంది, మహిళ పోలీస్ ఉమ, స్థానిక డ్వాక్రా మహిళలు దేవి, స్వాతి. చిలకలగెడ్డ సర్పంచ్ అప్పారావు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

11న బిజెపి రోడ్‌షో : జివిఎల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో భాగంగా ఆయన విశాఖకు చేరుకోగానే బిజెపి శ్రేణుల ఆధ్వర్యాన భారీ రోడ్ షో నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు తెలిపారు. బిజెపి విశాఖ నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఐఎన్ఎస్ డేగా వద్ద గల మారుతి జంక్షన్ నుంచి నేవల్ డాడ్ మీదుగా భారీ రోడ్ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో నరేంద్ర మోడీ సమావేశం అవుతారని చెప్పారు. 12వ తేదీన కేంద్ర ప్రభుత్వం రూ.15,200 కోట్ల నిధులతో ఆంధ్ర రాష్ట్రంలో తలపెట్టిన ఐదు కార్యక్రమాలకు శంకుస్థాపన, నాలుగు కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రధాని పర్యటనలో రాజధాని, విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి అంశాలు లేవని స్పష్టం చేశారు. రైల్వే జోన్‌పై ఇప్పటికే స్పష్టమయిన ప్రకటన చేశామని, డివిజన్ తరలింపుపై త్వరలో నిర్ణయం ఉంటుందని తెలిపారు. ఇది ప్రభుత్వ అధికారిక పర్యటన అని, పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానంపై పిఎంఒ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పెదవాల్తేరులో షాపుల కూల్చివేతపై మాట్లాడుతూ ప్రధాని పర్యటన కోసం చిరు వ్యాపారుల షాపులు కొట్టేముందు కనీసం నోటీస్ ఇచ్చి ఉండాల్సిందని, ఈ చర్య సమర్థనీయం కాదని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

స్వాధీనం చేసుకున్న డబ్బాలు

బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-హుకుంపేట: చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడటం చట్ట రీత్యా నేరమని అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ డివిజి రాజు తెలిపారు. అడిషనల్ ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ డివిజి.రాజు ఆధ్వర్యంలో ఏసీబీ పాడేరు స్టేషన్ సిబ్బంది, డివిజనల్ టాస్క్ ఫోర్స్, హుకుంపేట పోలీసు సిబ్బందితో మండలంలోని రాతులపుట్టు గ్రామంలో దాడులు చేశారు. 52 ప్లాస్టిక్ డ్రమ్ములతో పాటు బెల్లపు పులుపును ధ్వంసం చేశామని అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరిం టెండెంట్ డివిజి రాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సదరు బెల్లపు ఊట దారుడైన ఒక అనుమానిత వ్యక్తిని గుర్తించి అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామంలో నాటుసారాయి నిర్మూలనపై అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రధాని సభ విజయవంతమే లక్ష్యం

ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ, విశాఖ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయడమే మనందరి లక్ష్యం కావాలని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో బుధవారం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ స్థాయిలలోని ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేసేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలలోని 13 నియోజక వర్గాలకు ఇప్పటికే వాలంటీర్లు చేరుకున్నారని, 500 మంది వాలంటీర్లు అక్కడి ఇన్‌ఛార్జిలతో, క్షేత్ర స్థాయి నాయకులను సంప్రదించి ఆయా ప్రాంతాల నుంచి ప్రజలను బహిరంగ సభకు వాహనాల్లో తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషిస్తారని తెలిపారు. 11తేదీ సాయంత్రం 7:30 గంటలకు ప్రధాని విశాఖకు చేరుకుంటారని, రాత్రికి చోళా అతిథి బంగ్లాలో బస చేస్తారని చెప్పారు. 12వ తేదీ ఉదయం ప్రధాని బహిరంగ సభకు చేరుకునే గంట ముందుగానే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు బహిరంగ సభకు చేరుకునేలా చూడాలన్నారు. 3 లక్షల మంది బహిరంగ సభకు తరలి రావాలన్నది లక్ష్యమని, ఈ మేరకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వివిధ హోదాలలోని ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు తమ తమ సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీలు ఎంవివి సత్యనారాయణ, సత్యవతి, విశాఖ, అనకాపల్లి జిల్లాల వైసిపి అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కరణం ధర్మశ్రీ, విజయనగరం జిల్లా పరిషత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీలు వంశీకృష్ణశ్రీనివాస్‌యాదవ్, వరుదు కల్యాణి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం సర్క్యూట్ హౌస్‌లో ప్రధాని సభ ఏర్పాట్లు, ఇతర అంశాలకు సంబంధించి మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారితో కలిసి సమీక్షించారు. అనంతరం ఎయు ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌కు వెళ్లి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి రంగారెడ్డి

ప్రజాశకి-విఆర్.పురం : మండలంలోని రామవరం, రామవరం పాడు గ్రామంలో 270 ఇళ్లకు నష్టపరిహారం ఇప్పించాలని ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం వినతిపత్రం అందజేశారు. 166 ఇళ్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, అర్హులైన 270 కుటుంబాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్ కారం బుచ్చమ్మ, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, టిడిపి నాయకులు బురకా కన్నారావు, సవలం రాజు, గొర్రె వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మాజీ సర్పంచ్ కుంజా నాగిరెడ్డి, పంకు సత్తిబాబు, లబ్ధిదారులు ఉన్నారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రమాణస్వీకారం చేస్తున్న ఎపి ఎన్‌జిఒల అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో తాలూకా యూనిట్ ఎన్నికలు బుధవారం జరిగాయి. 11 పోస్టులకు 11 మంది నామినేషన్ చేయగా సభ్యులందరూ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి పిఠాపురం యూనిట్ అధ్యక్షుడు ఏ శ్రీకృష్ణ ప్రకటించారు. ఈ ఎన్నికలకు పరిశీలకుడిగా డి.డేవిడ్ ఏలియజర్ వ్యవహరించారు. అధ్యక్షులుగా గుద్దటి రామమోహన్‌రావు, సహ అధ్యక్షులుగా పీపకాయ వెంకటకృష్ణ, కార్యదర్శిగా కెపి.ఆనంద్ ఎన్నికయ్యారు. వారికి ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి కొయ్యూరు : మండలంలోని శరబన్నపాలెం పంచాయతీ సరమండ, దద్దుగుల గ్రామాలలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను బుధవారం ఎంపీటీసీ సోమా గాంధీ, వైసిపి నాయకులు జి.మహేష్ పంపిణీ చేశారు. ఈ రెండు గ్రామాల్లో 71 మందికి పట్టాల పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిముడు సత్యనారాయణ, వీఆర్వో వెంకయ్యమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపిటిసి, వైసిపి నేతలు

‘ఆర్‌ఎస్’ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వై.రామవరం మండలం కానివాడ పంచాయతీ పరిధి పనసలోవ ఆర్‌ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కంటే స్వాతి ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిపిఎస్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, కంచాలు, వాటర్ బాటిళ్లు, చార్ట్‌లు పంపిణీ చేశారు. పాఠశాలకు బెంచీలు, కుర్చీలు అందించారు. పాఠశాల భవనానికి రంగులు వేయించారు. గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడే వారికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సరైన రహదారులు లేక, పాఠశాలలు పూర్తిగా నిర్మాణం కాక గిరిజన విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గుర్తించి వారికి విద్య, వైద్యం రహదారి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు వీకరాజన్న దొర, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్‌ఎస్ ప్రతినిధులు

కాఫీ కొనుగోలుకు ముమ్మర ప్రయత్నాలు

గోదాములను పరిశీలిస్తున్న జిసిసి మేనేజర్ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి- సీలేరు : లక్ష్యానికి మేరకు కాఫీ గింజలు కొనుగోలుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని జిసిసి మేనేజర్ మల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జీకే వీధి, చింతపల్లి మండలాల్లో 500 మెట్రిక్ టన్నులు కాఫీ సేకరించడానికి అధికారులు లక్ష్యం విధించారని, ప్రస్తుతం తమ సిబ్బందితో కాఫీ గింజలు సేకరిస్తున్నామని చెప్పారు. జిసిసి గోదాములు, డిపోలు మరమ్మతులు చేయడానికి చింతపల్లి జిసిసి డిఎం ప్రతిపాదన చేశారని పేర్కొన్నారు. గ్యాస్ అమ్మకాలు విస్తృతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

దారకొండలో మినీ గ్యాస్ గోదాం పెట్టడానికి ప్రతిపాదన చేసామని రెండు మూడు నెలల్లో గ్యాస్ గోదాంను ప్రారంభిస్తామని తెలిపారు. వచ్చేనెలలో తేనె కొనుగోలు చేస్తామని, ప్రస్తుతం కిలో రూ.170 ఉండగా, దాని ధరను రూ.200 పెంచి కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సీలేరు పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు.

18 నుంచి జిమ్‌సర్‌లో రేడియాలజిస్టుల శిక్షణ సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ

ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఆఫ్ ఎపి (ఎపిఐఆర్ఐఎ), యుకెకు చెందిన రాయల్ కాలేజ్ ఆఫ్ రేడియాలజిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 20 వరకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చిలో సదస్సు నిర్వహిస్తున్నాయని జిమ్‌సర్ రేడియాలజీ విభాగాధిపతి బి.కె. దుర్గాప్రసాద్ తెలిపారు.

భారత్, యుకెలకు చెందిన ప్రముఖ రేడియాలజీ నిపుణులు డాక్టర్ రాదేష్ లాలం, డాక్టర్ హరుణ్ గుప్తా, డాక్టర్ యారోస్వ్లార్విజ్, డాక్టర్ దానూబ్ దలిలి పాల్గొని, వైద్య రంగంలో రేడియాలజీకి సంబంధించిన నూతన ఆవిష్కరణలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాయల్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీ సర్టిఫికేట్లను అందజేస్తుందన్నారు. పూర్తి వివరాలకు ఎపిఐఆర్ఎ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్. గురుప్రసాద్, కార్యదర్శి డాక్టర్ బి.సురేష్ ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-పద్మనాభం: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం రాయితీలను ఇస్తూ ప్రోత్సాహిస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మన్మధరావు అన్నారు. బుధవారం మండలంలోని కోరాడలో సర్పంచ్ కోరాడ లక్షణరావు సౌజన్యంతో శారద వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల సాగుపై రైతులకు ఒకరోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మన్మధరావు కార్యక్రమంలో మాట్లాడుతూ, ఎపిఐఐ ఎటిపి పథకంలో ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. రెగ్యులర్ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆరుతడితో పండే ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలను సాగువైపు రైతులు ఆసక్తి చూపాలని కోరారు. భీమిలి సబ్‌డివిజన్ హార్టీకల్చర్ అధికారి స్వాతి మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలోని భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కూరగాయలు, పూలసాగు అధిక విస్తీర్ణంలో ఉందని,వీటిని మరింతగా ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని రైతులను కోరారు. జెడ్‌పిఎన్ఎఫ్ డివిజనల్ అధికారి వెంకటరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీ. వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

తెలుగుకు ఊపిరి పోసిన బ్రౌన్

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు భాష సాహిత్యాలు నిర్లక్ష్యానికి గురైన కాలంలో ఒంటిచేతితో వాటికి ఊపిరిపోసి బతికించిన వ్యక్తి సిపి బ్రౌన్ అని డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్ అన్నారు బుధవారం పౌరగ్రంథాలయంలో పరవస్తు బడ్జెట్, తెలుగు దండు ఆధ్వర్యంలో బ్రౌన్ జయంతి నిర్వహించారు.

అమూల్యమైన తాళపత్ర గ్రంథాలను సేకరించి సంస్కరించి. పరిష్కరించి. ముద్రించి తెలుగు భాష సాహిత్యాలకు ఎనలేని గౌరవ స్థానాన్ని తెచ్చిపెట్టిన మహోన్నత వ్యక్తి బ్రౌన్ అని కొనియాడారు. కార్యక్రమంలో చిన్న సూరి ధర్మవతి పంతులు, లలిత కామేశ్వరి శర్మ, సారిపల్లి మంగమణి, శ్రీనివాస్, ధనుంజయ్, కవులు రచయితలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మర్రిగూడెంలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామ పరిసరాల్లో చెత్తా చెదారాలు తొలగించి పరిశుభ్రపరిచారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు గురించి అవగాహన కల్పించారు.

పిహెచ్‌సి వైద్యాధికారిగా సౌమ్య

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా సౌమ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పిహెచ్‌సి పరిధిలో ఉన్న గిరిజనులకు వైద్య సేవలు విస్తరిస్తామని తెలిపారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించామని, వారికి పూర్తిస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సౌమ్య

23న అనంత పద్మనాభుని దీపోత్సవం

ఏర్పాట్లుపై కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-పద్మనాభం : ఈనెల 23న నిర్వహించనున్న అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు, నేతలు, ప్రజలు, భక్తుల పరస్పర సమన్వయం, సహకారంతో విజయవంతం చేయాలని ఎంపికి కె.రాంబాబు కోరారు. బుధవారం పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ ప్రాంగణం, కుంతీమాధవస్వామి ఆలయ సామాజిక భవనంలో ఇఒ కీర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, గడిచిన రెండేళ్లు కోవిడ్ కారణంగా దీపోత్సవానికి భక్తులను పూర్తిస్థాయిలో అనుమతించని పరిస్థితుల్లో ఈ ఏడాది అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున లక్షల్లో భక్తులువచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండాచూసుకోవాలన్నారు. కొండపైకి వాహన రాకపోకలను పోలీసులు అనుమతించనప్పటికీ, ప్రసాదం, తాగునీటి ప్యాకెట్లు, ఇతర సరుకులు తీసుకెళ్లే వాహనాలకు పోలీసులు అనుమతించాలని కోరారు. ఈ సందర్భంగా ఇఒ శ్రీనివాసరావు దీపోత్సవ ఏర్పాట్లకు సంబంధించి 26అంశాలతో కూడిన నివేదికను సమావేశంలో సమర్పించారు. సింహచలం దేవస్థానం ఎఇఒ జె శ్రీనివాసరావు, సింహచలం ఆర్‌టిసి డిపో మేనేజర్ రాజశేఖర్, విజయనగరం అసిస్టెంటు మేనేజర్ ఆదినారాయణ, ఎండోమెంట్ అధికారి విఎస్ఎన్ మూర్తి, తగరపువలస అగ్నిమాపక విభాగం ఎఎస్ఐ కె చక్రవర్తి పాల్గొన్నారు.